అధ్వాన రహదారులతో అవస్థలు

- కొండవాలులో రాళ్లు తేలిన బీటీ రోడ్లు
- కొన్ని చోట్ల తవ్వి వదిలేసిన వైనం
- ప్రమాదాల బారిన వాహన చోదకులు

కంచరపాలెం: జీవీఎంసీ 47, 48 వార్డుల పరిధి ఊర్వశి కూడలి కొండవాలు ప్రాంతాల్లోని బీటీ రోడ్లు అధ్వానంగా మారాయి. రాళ్లు తేలిన ఈ రహదారులపై రాకపోకలకు స్థానికులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో తాగునీటి పైపులకు మరమ్మతులు చేపట్టిన జీవీఎంసీ అధికారులు తవ్విన రోడ్లను పట్టించుకోకుండా వదిలేయడం దారుణమని పలువురు వాపోతున్నారు. తవ్వి వదిలేసిన గోతులు ప్రమాదాలకు నిలయంగా మారాయని చెబుతున్నారు.

ఈ ప్రాంతాల్లో..

కంచరపాలెం జాతీయ రహదారి, ఊర్వశి జంక్షన్ నుంచి బర్మాక్యాంప్, శ్రీనివాస్‌నగర్, జైభారత్‌నగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో.. బర్మాక్యాంప్ నూకాలమ్మ గుడి, కె.కాలనీ, బర్మా కాలనీ పాఠశాలలకు వెళ్లే మార్గాల్లో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో రాళ్లు తేలిన రహదారులు దర్శనమిస్తున్నాయి. వాహన చోదకులు అటుగా ప్రయాణించేటప్పుడు తమ పైకి రాళ్లు ఎగిసిపడుతున్నాయని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా మారిన ఈ రహదారుల్లో ప్రయాణించే సమయంలో ఒళ్లు హూనమవుతోందని స్థానిక వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు. ఇక్కడి రహదారి సమస్యలపై ఇటీవల వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుకు స్థానిక వార్డుల ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. జీవీఎంసీ కమిషనర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



ఊర్వశి జంక్షన్ - బర్మాక్యాంప్ బీటీ రోడ్డు దుస్థితి



శ్రీనివాసనగర్‌లో గోతులతో రహదారి

శాశ్వత పరిష్కారం చూపాలి



ఇక్కడి కొండవాలు ప్రాంతాల్లో రాళ్లు తేలి, గోతులతో నిండిన రహదారులపై రాకపోకలకు తంటాలు పడుతున్నాం. అధికారులకు తమ గోడు పట్టడం లేదు. ఫిర్యాదులపై అప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నారే తప్పా.. శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

– రాము, బర్మా క్యాంప్

రహదారులను బాగు చేయండి



48వ వార్డులోని రహదారుల సమస్యపై జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రాళ్లు తేలి అధ్వానంగా మారిన రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలి.

– నీలి.రవి, ఇందిరానగర్

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమిషనర్

విద్యార్థులతో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మురళీనగర్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతోపాటు పూర్తిగా నిషేధించేందుకు విద్యార్థులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు కోరారు. ప్లాస్టిక్ నిషేధం, తడి–పొడి చెత్త నిర్వహణ అంశాలపై కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లు భూమిలో కలవడానికి వెయ్యేళ్లు పడుతుందన్నారు. ప్లాస్టిక్ వల్ల జీవజాతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వివరించారు. ప్లాస్టిక్ స్థానంలో గోనె, కాటన్‌తో తయారు చేసిన సంచులు వినియోగించాలని సూచించారు. ఈ మార్పు విద్యార్థులతోనే ప్రారంభం కావాలన్నారు. ఇంట్లోని తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర వహించాలని కమిషనర్ సూచించారు. ముందుగా కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

రచయిత్రి, చిత్రకారిణి శారదమ్మకు ఘన సత్కారం

కంచరపాలెం: అలనాటి సంచలన నాటక, సినీ రచయిత, పాత్రికేయుడు దివంగత భీశెట్టి లక్ష్మణరావు సతీమణి రచయిత్రి, చిత్రకారిణి భీశెట్టి శారదమ్మను రచయిత బి.వి.అప్పారావు దంపతులు మంగళవారం ఘనంగా సత్కరించారు. భీశెట్టి లక్ష్మణరావు రచతయిగా అనితర సాధ్యమైన ప్రగతి సాధించడంలో శారదమ్మ సహకారం అమూల్యమైనదని అప్పారావు పేర్కొన్నారు. తన రచనా స్ఫూర్తిదాతైన లక్ష్మణరావు భార్య శారదమ్మను సత్కరించుకోవడం గురువు రుణం కొంత తీర్చుకున్నట్లయిందన్నారు. భీశెట్టి వద్ద తాను సినీ రచన నేర్చుకున్న 1975 సమయంలో శారద తనపై చూపిన వాత్సల్యం మరువలేనిదని బి.వి.అప్పారావు గుర్తు చేస్తుకున్నారు.



శారదమ్మను సత్కరిస్తున్న రచయిత బి.వి.అప్పారావు దంపతులు

క్లుప్తంగా

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో స్కంద పూజలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆడ పిల్లలను కాపాడుకుందాం



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ రాజేంద్ర

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీబీ వారోత్సవాలు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణలపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సనపల రాజేంద్ర మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. సమాజంలో ఆడ, మగ బేధం ఉండకూడదన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఆడ శిశువులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం రాంజీ ఎస్టేట్, కప్పరాడ, తిక్కవానిపాలెం కాలనీల్లో వైద్య సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌టీఎస్ గోవింద్, ఎస్‌టీఎల్ఎస్ శరత్, ఎల్‌టీ పూర్ణిమ, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి రూ.10 వేలు అందజేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త, 251వ బూత్ మెంబర్ పేడాడ చిరంజీవికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆర్థిక సాయం చేశారు. గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న అతడి రెండు కిడ్నీలు చెడిపోయాయని తెలుసుకున్న కార్పొరేటర్ తన సొంత నిధులు రూ.10 వేలను మంగళవారం అందజేసి అండగా నిలిచారు.

మూలకు చేరిన డస్ట్ బిన్లు



రాధాకృష్ణ లేఅవుట్‌లో పాడైన డస్ట్ బిన్

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24, 23 వార్డుల్లో పలు చోట్ల ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లు పాడై మూలకు చేరాయి. కొన్ని చోట్ల పాడైన వాటికి మరమ్మతులు చేయకపోవడంతో రోడ్ల పక్కన పడి ఉన్నాయి. సీతమ్మధార రాధాకృష్ణ లేఅవుట్‌లోని పాపాహోం ఎదురుగా ఖాళీ స్థలంలో ఒక డస్ట్ బిన్ నిరుపయోగంగా పడి ఉంది. జీవీఎంసీ శానిటరీ అధికారులు పట్టించుకోక పోవడంతో అక్కడ రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. వాటిని కుక్కలు పీక్కుతింటూ చెల్లాచెదురు చేస్తున్నాయి. వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోందని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

స్కేటింగ్‌లో బుల్లయ్య కళాశాలకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో బుల్లయ్య కళాశాల యాజమాన్యం

సీతంపేట: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18 వరకు శివాజీ పార్క్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోలర్ స్కేటింగ్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీలకు ఏయూ తరఫున ప్రాతినిధ్యం వహించిన బుల్లయ్య కాలేజీ విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపి ఆల్ ఇండియా లెవెల్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న టి.షణ్ముఖ రాకేష్ స్కేట్ బోర్డింగ్ విభాగంలో బంగారు పతకం పొందాడు. బీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతున్న ఎస్.యుక్త వార్డ్ హాకీ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ హాకీ విభాగంలో రజత పతకం, బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న బి.ఆశ్రిత ఫ్రీస్టైల్ విభాగంలో రజత పతకం, బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి సిహెచ్.వి.పవన్ కార్తికేయ స్కేట్ బోర్డింగ్ విభాగంలో కాంస్య పతకం, బీఎస్సీ థర్డ్ ఇయర్ విద్యార్థి డి.వేణు వర్ధన్ ఆర్టిస్టిక్ ఫ్రీ స్కేటింగ్‌లో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను బుల్లయ్య కళాశాల సెక్రటరీ అండ్‌కరస్పాండెంట్ జి.మధుకుమార్‌తోపాటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, అసిస్టెంట్ డీన్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, యు.గంగాభవాని అభినందించారు.

సామాజిక న్యాయానికి ప్రతిరూపం సీఎం జగన్

మద్రిపాలెం: సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిరూపమని వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తుళ్లి చంద్రశేఖర్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయించడం ఇందుకు నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలను తెలుగుదేశం పార్టీ ఓటర్లుగానే చూసిందని, వారికి రాజకీయ భవిష్యత్తు ఇవ్వాలని ఏనాడు ఆలోచించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ బీసీలకు అండగా నిలిచారన్నారు.

వివేకానందుడి సాహిత్యంపై యువత అధ్యయనం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్

మురళీనగర్: స్వామి వివేకానందుడు రచించిన సాహిత్యాన్ని యువత అధ్యయనం చేసి ఉత్తమ పౌరులుగా తయారు కావాలని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పిలుపునిచ్చారు. రామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా మంగళవారం మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో వివేకానంద యువ మహామండలి అధ్యక్షుడు దివంగత నాయుడు లక్ష్మీనారాయణ పేరు మీద నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలిచి భారత సంస్కృతీ, సంప్రదాయాలను చాటిచెప్పిన వివేనందుడి బాటలో అందరం నడవాలన్నారు. ఆయన ప్రవచించిన ఆధ్యాత్మిక, చైతన్య భావాలను యువత అలవరచుకోవాలని సూచించారు. ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు అభివృద్ధికి దివంగత వ్యాసం శ్రీరామమూర్తి, నాయుడు లక్ష్మీనారాయణలు చేసిన కృషిని మరిచిపోలేమని చెప్పారు. ముందుగా రామకృష్ణ పరమహంస, వివేకానందుడి విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. వీవీవైఎం సభ్యుడు ఎస్.నాగేశ్వరరావు రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, వీవీవైఎం అధ్యక్షుడు విద్యాధర సింగ్, పార్కు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ 51వ వార్డు నాయకులు, సచివాలయ కన్వీనర్లు

మద్రిపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 51వ వార్డు కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, సచివాలయ కన్వీనర్లతో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వారీగా ప్రతి ఒక్క ఓటరును కలిసి తమ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పైడి శ్రీను, ప్రసూనారెడ్డి, పార్టీ నాయకులు మెట్ట దమయంతి, దిడ్డి రమేష్, పప్పల లక్ష్మణ్, శ్యామ్, ధర్మవతి, రత్న, వై.వరలక్ష్మి, లత, ధర్మేంద్ర, అప్పారావు, గణేష్, వినోద్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



అందించిన పుస్తకాలతో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులోని నూతన లైబ్రరీకి మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు తెలుగులో రచించిన పుస్తకాలను బహూకరించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా పార్కు ఉపాధ్యక్షులు జి.వెంకటరత్నంకు 50 పుస్తకాలు అందించారు. రాయవరపు సరస్వతి రచించిన 20 కథానికలు, పుస్తకాలు, వి.కొండలరావు రచించిన గ్రామ నామాలు, ఊరు పేరు వంటి రచనలు ఇందులో ఉన్నాయి. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి పాల్గొన్నారు.

చోరీకి గురవుతున్న ద్విచక్ర వాహనాలు

మద్రిపాలెం: మద్రిపాలెం శ్యామ్‌నగర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఓ వ్యక్తి ఇంటి ముందు పార్క్‌చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. శ్యామ్‌నగర్ కాలనీకి చెందిన బీలా రవికుమార్ పనులు ముగించుకుని ఎప్పటిలాగే సోమవారం రాత్రి ఇంటి ముందు తన టూ వీలర్‌ను పార్కింగ్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి నడుచుకుంటూ వచ్చి వాహనంతో పరారయ్యాడు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు క్రైం పోలీసులను వివరణ అడగ్గా.. బాధిత వ్యక్తి ఫిర్యాదు ఇవ్వడానికి ఇష్టపడలేదని, ఒకసారి వెరిఫై చేసుకున్నాక ఇస్తారని చెప్పినట్టు తెలిపారు.

నెల రోజుల వ్యవధిలో 3..

గత నెలలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు వచ్చిందని క్రైం పోలీసులు తెలిపారు. మొత్తంగా నెల రోజుల వ్యవధిలో 3 ద్విచక్ర వాహనాలు మాయమయ్యాయి. గత నెల 19న వరప్రసాద్, నాగసతీష్ అనే ఇద్దరు యువకుల ద్విచక్ర వాహనాలు దొంగతనానికి గురికాగా, మంగళవారం తెల్లవారుజామున మరో వాహనం చోరీ జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి పూట ఈ ప్రాంతంలో కనీస గస్తీ లేదని, అర్ధరాత్రి గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు



రచయిత వరలక్ష్మిని సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సీతంపేట: మాతృ భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే రాయాలని పలువురు వక్తలు సూచించారు. 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యమాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శివ గీతార్చన, కరుణామృత పుస్తకాల రచయిత నారాయణం వరలక్ష్మి, విశిష్ట అతిథులుగా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు మళ్ల వెంకటరావు, బండే వెంకటేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ కవితలు, గేయాలు పాడి వినిపించారు. లలిత అ, ఆల గురించి, పేరి భార్గవ్, భాస్కరమ్మ కవుల గురించి వివరించారు. మళ్ల వెంకటరావు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాంతీయ భాషలను బోధించాలని సూచించారు. అనంతరం రచయిత వరలక్ష్మిని ట్రస్టు ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టీ మళ్ల లక్ష్మి, పాలిమేర లక్ష్మీనాయుడు, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

యూజీడీ లీకుతో ఇబ్బందులు



శ్రీనివాసనగర్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఒక ఇంటి ముందున్న యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. దాని నుంచి మురుగు నీరు పొంగి ప్రవహిస్తుండటంతో నివాసులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలి.

– సిహెచ్.వెంకటరావు, శ్రీనివాసనగర్

47వ వార్డులో కె.కె.రాజు పర్యటన



రాంజీ ఎస్టేట్‌లో గెడ్డను పరిశీలిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డులో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. కంచరపాలెం రాంజీ ఎస్టేట్, జగ్జీవన్ నగర్, అరుంధతి నగర్, సురేష్ రామ్ నగర్, అంబేడ్కర్ ఎస్టేట్ ప్రాంతాల్లో స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంజీ ఎస్టేట్ యూపీహెచ్‌సీ పనులు, రక్షణ గోడలు, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, డ్రైనేజీ, కాలువల మరమ్మతులు, వీధి కుళాయిలు, సురేష్‌రామ్ నగర్‌లో కళా వేదికలు, సామాజిక భవనాల నిర్మాణాలు దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పర్యటనలో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, అప్పారావు, సుకుమార్, విజయ్, రాఘవులు, సురేష్, చందు, అనిల్, కృపా, జయ్‌కుమార్, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న కంపా హనోకు, పైడి రమణ, ఆలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్‌లో సత్యసాయి సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న ప్రారంభమైన విజయ దుర్గాదేవి ఆలయ 17వ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. మంగళవారం తొలేళ్లు, అమ్మవారికి పూజలు, అమృతాభిషేకాలు, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి కాలనీలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణలు ప్రారంభించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన రేలా రే రేలా కార్యక్రమం జనాన్ని అలరించింది.

నేడు విశేష పూజలు, ఊరేగింపు..

ఆలయంలో బుధవారం వేకువజాము నుంచి కుంకుమ పూజలు, అర్చనలు, సాయంత్రం నుంచి సాముగరిడీ, తప్పెటగుళ్లు, పులివేషాలతో, కలశాలు, ఘటాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు కారుకొండ రాజు తెలిపారు. పార్టీ నాయకులు హరి పట్నాయక్, పైడి నాగరాజు, సన్నీ, నేపాల్ శ్రీను, దుర్గా, బాబూరావు, నాయుడు, పలిశెట్టి గణపతి, సంఘ సభ్యులు రవిశంకర్, వాసుపల్లి ఎల్లాజీ, తిప్పాన ఆదినారాయణ, మడక పైడిబాబు, కారుకొండ కనకరాజు, కొసిరెడ్డి సూరిబాబు, ఉల్లాస రమణ, కొలిమాలి మునలినాయుడు, వాసుపల్లి వెంకటేశ్వరరావు, గున్నాబత్తుల శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు



ఎల్లమ్మ దేవాలయం

డాబాగార్డెన్స్: భక్తులకు కొంగు బంగారంగా పూజలందుకుంటున్న ఎల్లమ్మ జాతర వార్షిక ఉత్సవాలు ఈ నెల 28, మార్చి ఒకటి తేదీన పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 28న తొలేళ్ల ఉత్సవం, మార్చి ఒకటిన జాతర జరపనున్నారు. మహాశివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పులవీధి జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, దర్శనాలు, ఉదయం నుంచి మాలధారణ భక్తులు శూలాల ప్రదర్శన నిర్వహిస్తారు.